
# యాత్ర



## తురగా జానకీరాణి

వెంకటరావు ఇంటికి తిరిగి వచ్చాడు. దూదిపింజలా ఎగిరి వచ్చాడు. మల్లెపూవు లాంటి మందహాసంతో వచ్చాడు. రిటైరైన ఈ పదేళ్లలో వంగిపోయిన వీపు ఈ వేళ నిటారుగా ఉంది.

ఈశ్వరి మంచినీళ్లిచ్చింది. ఏం జరిగిందని అడగకుండానే ఆమెకు సంగతి తెలిసిపోయింది. ఆయన చొక్కా గుండీలు విప్పుకున్నాడు. చిరునవ్వుతో ఇల్లాలి వంక చూశాడు. "మనకి మంచి రోజు లొచ్చాయి" అన్నాడు.

ఈశ్వరికి నవ్వొచ్చింది. "మరో పదేళ్ళయినాక రావలసినవి ఇప్పుడే వచ్చాయేం?" అన్నది.

"వెటకారంగా మాట్లాడకు. మాకు కూడా కొత్త జీతాల స్కేలు వర్తిస్తుందన్నారు. 1971 నుంచి లెక్కగట్టి, ఇప్పటివరకు రావలసిన బకాయిలు మొత్తం ఇస్తామన్నారు. ఇంతమంచి కబురు చెప్పాం కదా రావుగారూ, కాఫీ పోయించరా అని అందరూ తగులుకున్నారు. అందరికీ కూల్‌డ్రింక్స్ ఇప్పించేశాను" అన్నాడు.

వెంకటరావు టేబుల్ ఫ్యాను స్విచ్ వేసి దానికి దగ్గరగా పడక్కుర్చీ లాక్కుని అందులో వాలిపోయాడు.


ఆయన అందించిన చొక్కా మేకుకి తగిలించి, " ఇంతకీ ఎంత వస్తుందిట? లెక్క లేమైనా తేల్చారా?" అన్నది ఆశగా.

భార్యని ఊరించకుండా చెప్పదలుచుకోలేదు వెంకటరావు. "చెప్పుకో" అన్నాడు. ఇలా ఆయన తనకి పరీక్ష పెట్టడం ఈశ్వరికి ఇష్టంలేదు.

"ఓ లక్ష వస్తుందా?" అన్నది.

ఎంత వెర్రి మొహానివే అన్నట్టు చూసి, "ఇరవై ఏళ్లకీ అంతే నంటావా?" అన్నాడు. లక్ష రూపాయల కంటే ఎక్కువ ఒక్కసారి వచ్చి పడుతుం దనేసరికి ఆమెలో సంతోషం పొంగి పొర్లసాగింది. కాఫీ తెస్తానంటూ లోపలకు వెళ్లింది.

వీధిలోకి చూస్తూ పడక్కుర్చీలో కూర్చున్న వెంకటరావుకి కూడా సంతోషంతో మనస్సంతా వెన్నెలైంది. మూడున్నర లక్షలో, నాలుగు లక్షలో




ఇంకా సరిగ్గా లెక్క తేల్చలేదు. తనకి ప్రమోషను, పై స్కేలులో జీతం నిర్ణయం - అబ్బో! అంత తతంగమూ పది రోజుల్లో పూర్తి చేస్తామని మాట ఇచ్చిన తన సహోద్యోగులకి ఎన్నిసార్లు ధన్యవాదాలు అర్పించుకున్నాడో!

అంత అంకె తను చేత్తో కాగితం మీద బడ్జెటుల్లో వేయడమే కానీ, స్వంత జీవితంలో అన్ని సున్నాలతో ఎప్పుడూ అవసరం పడలేదు. తను కళ్లతో చూడలేదు అంత డబ్బు.

తనది అదృష్ట జాతకమే అని చిన్నప్పుడు బామ్మ అంటే ఎవ్వరూ నమ్మేవారు కాదు. అ దో జోక్ అన్నట్లు నవ్వేవారు. ఎందుకంటే ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి అవుతూనే ఉద్యోగంలో చేరిపోయాడు. ఈశ్వరిని పెళ్లాడాక కలసి వస్తుం దనుకొన్న ఆస్తి, కోర్టు కేసుల్లో చిక్కుకునిపోయింది. తండ్రి తనకు సంక్రమించిన ఇల్లు, పొలాలు పేకాటల్లో పోగొట్టుకున్నాడు. వ్యసనాలతో ప్రాణమూ పోగొట్టుకున్నాడు. ఎటు చూసినా లక్ష్మీ ప్రసన్నంలేని జీవితం.

బొటాబొటి సంపాదనతో భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు - ముగ్గురు సంతానాన్నీ తన నాయనమ్మనూ - అందరినీ పోషించాడు. అన్నిటికి వెతుకులాటే. అద్దె ఇళ్లల్లో, పిల్లల చదువులు, జబ్బులు, శక్తికి మించిన సంబంధం కూతురికి చేసి అప్పులు చేయడం - వీ టన్నిటితో పోరాడి, రిటైరుమెంటు నాటికి రేపటి సంగతి ఏమిటి అనే గతికి వచ్చాడు వెంకటరావు.

ఇటువంటి పరిస్థితిలో తన పోస్టు అప్‌గ్రేడు కావడం, దయగలవా రెవరో రూల్స్ తిరగేసి, తిరగరాయించి తన కింత లాభం చేయడం కలలోని కథ నిజమైనట్లయింది. ట్రిబ్యునల్‌లో కేసు తన పక్షమైందని తెలిసి, పై ఆఫీసర్లు కూడా పాపం ముసలాయన బాగుపడతాడని సంతోషించారే కానీ, దురాశగా ఏమీ మాట్లాడలేదు. ఇంక ఆయనకు సంతోషం కాక ఏమిటి?

కాఫీతో బాటు వేడిగా బజ్జీలు కూడా తీసుకొచ్చింది ఈశ్వరి. "మనయందు భగవంతు డున్నాడండీ! నేను చెప్పడం లేదూ? మన కష్టాలు, మ నమ్మాయి కష్టాలు గట్టెక్కే రోజులు వచ్చాయి" అనది.

చిన్న షాకు తగిలింది వెకటరావుకి. అప్పుడే ఈ సంగతులు ఆలోచించటం ఆరంభించిం దన్నమాట. బజ్జీ తుంచి నోట్లో వేసుకుని, "మనకేం కష్టా లున్నాయి? మ నమ్మాయి కేం కష్టా లున్నాయి?" అన్నాడు.

"అంటే మనం చాలా సుఖంగా ఉన్నా మంటారా? డబ్బు అవసరం లేదా?" అన్నది ఈశ్వరి ఆశ్చర్యంగా.

"మనం అంటే నువ్వూ, నేనూనా? నీకేం లోటు? మహారాణిలా ఉన్నావుగా!" అన్నాడు వెంకటరావు. చాలా రోజుల తర్వాత, నొసలు చీకాకుగా చిట్లించకుండా, ప్రసన్నంగా మాట్లాడుతున్నాడు భర్త అని గుర్తించింది ఈశ్వరి. కానీ ఇలాగే మాట్లాడనిస్తే, తన చేయి దాటి పోతాడు అనుకుని-

"మహారాణినే - ఏడు వారాల నగలు, దాసదాసీ జనం, బ్రహ్మాండమైన అంతఃపురం - చాల్లెండి. నా దగ్గర కూడా పోజు లెందుకు? సుఖంగా ఓ వెయ్యి రూపాయలు పారేసి ఏదైనా కొందామంటే వీలుందా మనకి!" అన్నది కూజాలోంచి నీళ్లు వంపి ఇస్తూ. వెలితిగా, కరవుగా, వెతుకులాటగా బతుకుతున్నా గానీ, ఈశ్వరి నోటితో ఆ మాట అంటే, తన అసమర్థత ఎత్తి చూపుతున్నట్లు అనిపిస్తుంది ఆయనకి.

"సరేలే - నువ్వు బజారులో పారేసేందుకు వెయ్యి రూపాయలు శాంక్షన్. దానితో మన కష్టాలు తీరిపోయినట్లేనా?" అన్నాడు.

"మన అంటే మన మిద్దరమేనా? మన అమ్మాయి, అబ్బాయిలు వాళ్లని చూస్తే జాలేస్తుందండీ! దాని కాపురం చూడండి ఎలా ఉందో! పుట్టింటి వారు తనని ఆదుకోవాలని ఎన్నడూ ఆశించలేదు పాపం వెర్రిపిల్ల" అన్నది. కంఠంలో ఒణుకు, ఆపేక్ష వస్తున్నాయి.

"అమ్మాయికి ఇద్దరే పిల్లలు. అయినా వాళ్ల చదువులకే డబ్బు ఎంతెంతో అయిపోతోందిట. కట్నంలో అయిదు వేలు కొరత పెట్టారు, అది తర్వాత ఇస్తామంటే ఊరుకున్నాం కదా, ఈ పదేళ్లలో దానికి వడ్డీ కలిపితే ఒక కలరు టీ.వీ. ఇవ్వాలి మీ నాన్న అంటాడు అల్లుడు. అయిదు కాసుల బంగారం కూడా బకాయిపడ్డారు వాగ్దానం చేసిన దానికి. కనీసం ఎనిమిది కాసులన్నా ఇవ్వాలి న్యాయం ప్రకారం అంటుందిట వియ్యపురాలు.

"అనుకున్న వన్నీ ఇచ్చేస్తే పాపం, దాని కాపురం సంతోషంగా సాగుతుంది. అంతా కలిపి ఒక యాభై వేలు. ఏమిటలా చూస్తారు! మన అమ్మాయి, నేను కన్న కూతురు విశాల లేదూ, దాని సంగతే నేను మాట్లాడుతున్నది!" అన్నది.

పాపం విశాల! ఇరవై ఏళ్లలోపే ఇద్దరు బిడ్డల తల్లి అయిన కూతుర్ని చూస్తే వెంకటరావుకీ జాలే. కానీ ఈశ్వరి తన కొచ్చే డబ్బు గురించి ఈ క్షణాన ఇలా బడ్జెటు తయారుచేయడం అనవసరం అనిపించింది.

"సరే, చూద్దాంలే" అన్నాడు. కళ్లు మూసేసుకుని న్యూసు పేపరు తీసి ముఖాన పడేసుకున్నాడు.


"పోనీలెండి గానీ డబ్బు ఎప్పు డొస్తుందిట?" అన్నది ఈశ్వరి అసహనంగా.

పేపరు తీసి కోపంగా చూశాడు వెంకటరావు. "ఎప్పుడో వచ్చినప్పుడు వస్తుంది. వేరే మాట, పలుకు లేకుండా జిడ్డులాగా పట్టుకున్నా వేమిటి?" అన్నాడు.

ఆమె కూడా చీకాకుగా చూసి, ఖాళీ పళ్లెం, గ్లాసు తీసుకుని లోపలకు వెళ్లింది.

అది మొదలు - వెంకటరావుకి రాబోయే మూడు, నాలుగు లక్షలు నాలుగు కోట్ల రూపాయలుగా ఇంటి వారందరికీ కనబడసాగాయి. పెద్దబ్బాయి విజయవాడలో ఉంటున్నాడు. అతనికి రెండు సమస్యలు. పిల్లలిద్దరూ - ఒ కమ్మాయి, ఒ కబ్బాయి ఇంజనీరు, మెడిసిను ఎంట్రెన్సు పాసై కూచున్నారు. కనీసం అరవై, డెబ్బై వేలు లేనిదే మామూలుగా నైనా వారి చదువు ప్రారంభం కాదు.

"వాళ్లే పెద్దవాళ్లై, సంపాదనపరులై ఋణం తీర్చుకుంటా



మంటున్నారు" అని వ్రాశాడు పె ద్దబ్బాయి తన ఉత్తరంలో. "నాకూ, తమ్ముడికీ సామాన్యమైన చదువులే చెప్పించావు. కానీ మనుమలకి పెద్ద చదువులు వచ్చేట్లు, నీ ఆశీర్వచనంగా ఈ సాయం చెయ్యి" అని వినయంగా కాళ్లకు బంధం వేశాడు.

మనుమలైతే, "డియరెస్ట్ తాత !" అంటూ మొదలెట్టి స్వచ్ఛమైన ప్రేమ లేఖలే వ్రాసేవారు.

ఇంక రెండోవాడు అనిల్ - రెండే ళ్లయింది అతని పెళ్లయి. భార్యతో సహా ఆమె ఆఫీసుకి దగ్గరగా రెండు గదుల వాటా అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ప్రతి ఆదివారం వా ళ్లిద్దరూ వస్తుంటారు. "మీరూ మాతోనే ఉండండి, నాన్నా! పెద్ద ఇల్లు తీసుకుంటాను. ఇక్కడ అద్దె దండుగ దేనికి?" అంటాడు అనిల్.

కోడలు వెంటనే కలుగజేసుకుంటుంది. "ఏనాటి నుంచో ఉన్నారు కనుక రెండు వందలకే ఇంత ఇల్లు వచ్చింది. మన ఇళ్ల దగ్గర ఏం వస్తుంది, పిచ్చుక గూళ్లలాగ. పిల్లలు నలుగురూ సెలవులకి రావాలంటే ఈపాటి ఇ ళ్లుండాలి" అని పెద్ద ఫుల్ స్టాపు పెట్టేస్తుంది.

అనిల్ యింకా ఏమైనా అనబోతే, "ఇప్పుడు వీళ్లు ఖాళీ చేస్తే అయిదు వంద లంటారు ఈ ఇంటి వాళ్లు - మీ వన్నీ మతిలేని మాటలు" మొగుడి నోరు నొక్కేస్తుంది.


ఈశ్వరికి ఇదంతా అలవాటైన సంగతే. "ఒంటరి కాపురం అలవాటైన పిల్లకి అత్త పోరు, మామ పోరు ఎందుకట? మాటవరసకి అబ్బాయి ఏదో అంటాడు. నా ఇల్లు నేను వదలను" అని చెప్పింది ఈశ్వరి ఒకసారి భర్తకి. ఆయన కూడా త లూపి అంగీకరించాడు.


వెంకటరావుకి రాబోయే ఈ డబ్బు వార్త మొదలైన రెండు మూడు ఆదివారాల తర్వాత ఒకసారి అనిల్, భార్య రమ వచ్చారు. వాళ్లు ఆవేళ అనవసరంగా అతి ప్రేమగా మాట్లాడుతున్నారా అనిపించింది వెంకటరావుకి. కన్న కొడుకు మీద అలాంటి అనుమానం రావటం అన్యాయ మనిపించి తమాయించుకున్నాడు. కానీ అరవై అయిదేళ్ల జీవితానుభవం పొరబాటు అంచనాలు వేయదు.

"నాన్నా! మే మున్న ఇంటి దగ్గర తెలిసిన కాంట్రాక్టరు మంచి బిల్డింగు కడుతున్నాడు. అందులో ఒక ఫ్లాటు నా కిస్తా నన్నాడు" అని ఉపోద్ఘాతం చెప్పాడు అనిల్.

రమ అత్తగారి దగ్గర కూచుని పూరీలు వత్తి ఇస్తోంది. "ఔను, అత్తయ్యా! చాలా బాగున్నాయి. రెండు బెడ్‌రూములు. నాలుగో అంతస్తులో ఇస్తామంటే, మా నాన్నగారు ఎక్కలేరు, మొదటి అంతస్తులోనే చూడమని గట్టిగా చెప్పారు మీ అబ్బాయి. మరీ కిందైతే గాలీ, వెలుతురు సరిగ్గా ఉండవు కూడా! ఇళ్లు మాత్రం ఎంత బాగున్నాయో! పెద్ద పెద్ద ద్వారాలు, అలమారలు, గచ్చు చల్లగా పాలరాయి లాగా" అని చాలా సంబరంగా చెబుతోంది.

"నిజమేరా! చాలా బాగుంటుంది. మీరు ఈ వయస్సులోనే ఇల్లు






ఏర్పాటు చేసుకోవాలి. రెండు జీతా లున్నవాళ్లు అద్దె కొంపల్లో ఎందుకురా ఉండడం?" అన్నాడు వెంకటరావు బాధగా కాక, చాలా సామన్య ధోరణిలో.

అనిల్ దెబ్బతిన్నట్లు చూశాడు. "అదేమిటి నాన్నా! మా ఇల్లు నీది కాదా?" అన్నాడు.

కొడుకు మీద అనురాగం పొంగి రాగా, "ఔను నాన్నా! మీ ఇల్లు నాదే!" అన్నాడు. ఆ తర్వాత వాళ్లు వెళ్లాక తెలిసింది అరవై వేలు ముందుగా కట్టాలనీ, మిగతా లక్షా ఎనభై వేలు ఆరు నెలలలోగా భర్తీ చేయాలని. కోడలు ఆఫీసుకి దరఖాస్తు చేస్తే, నాలు గైదు నెలల్లో లోను, అబ్బాయి ఇన్సూరెన్సు మీద కొంత సొమ్ము తీసుకుంటారుట. కానీ ముందు కట్టే అరవై వేలు, వీలుంటే ఆపైన మరో పాతిక వేలు - నాన్న సర్దితే బాగుంటుందని చెప్పి వెళ్లారుట.

వెంకటరావుకి గుండెల్లో రాయి పడింది. పిల్లలు ముగ్గురూ తన మీద ఎంతెంత ఆశలు పెట్టుకున్నారు? తన బ్రతుకు తనది కాదా? తన కష్టార్జితం తనది కాదా? వీరంతా ఎందుకు నిర్ణయించాలి తనకు రాబోయే డబ్బు ఎలా ఖర్చు పెట్టాలో?

సరిగ్గా నెల తిరిగేసరికి ఆ సొమ్ము వచ్చింది. ఆఫీసులో తినిపించవలసిన వారికి తినిపించాడు. విదిలించవలసిన చోట్ల విదిలించాడు. అక్క డక్కడ జరిగిన కోతలు భరించాడు. మూడు లక్షల డెబ్బై ఎనిమిది వేల నాలుగు వందల అరవై ఒక్క రూపాయి తన ఖాతాలో బ్యాంకిలో జమ అయింది. అన లిలా తన చేతికి అందిన వార్త తెలిస్తే అందరూ నెత్తిన వాలిపోతారని దడ పట్టుకుంది.

ఎన్నడూ ఏ విషయమూ ఈశ్వరి దగ్గర దాచలేదు. ఇదీ దాచడం చేత కావడం లేదు.


సాయంత్రం యథావిధిగా వడక్కుర్చీలో కూర్చున్నప్పుడు చిన్న తోలు బ్యాగులోంచి కాగితాలు బయటికి తీసి, "ఈశ్వరీ" అని పిలిచాడు. ఆమె పూలు మాలగా కడుతోంది. నూలు చీరలోని సన్నపాటి శరీరం, మధ్య తరగతి పోషణలో వంగినట్లు కనిపిస్తోంది. వంచిన తల ఎత్తింది. వెంకటరావు ముఖ్యమైన విషయాలు చెప్పేటప్పుడు పిలిచే కంఠ ధ్వని అది.

"ఈశ్వరీ! నే నొక మాట చెబుతాను. వింటావా?" అన్నాడు. చెప్పండి అన్నట్లు చూసిం దామె.

"పిల్లల్ని కన్నాము, పెంచాము, చేతనైనంత చదువు చెప్పించి స్వతంత్రంగా బతికేట్లు చేశాము. ఇంక ఏం చేయాలి, చెప్పు!" అన్నాడు.

ఆమెకు ఈ ప్రశ్న వెంటనే అర్థం కాలేదు. ఒక్క క్షణంలో అర్థం చేసుకున్నాక, "అంటే వాళ్లు అడిగినట్లు డబ్బులు ఇవ్వవద్దంటారా?" అన్నది.

"నన్ను ఇరుకున పెట్టకు. నాకు మా నాన్న ఏమి ఆస్తి ఇచ్చాడు? మీ నాన్న నీకు ఏమి ఆస్తి ఇచ్చాడు? ఇంత కాలం కలిగినంతలో పిల్లలకి మనం ఎన్ని ఇవ్వలేదు?" అన్నాడు. ఆయన మాటల్ ఆవేదన, జవాబు కోసం ఆమె ముఖంలో వెతుకుతున్నట్లు చూపుల కదలిక.




ఆమె కడుతున్న పూలు పళ్లెంలో వదిలేసి, "మన పెద్దవాళ్లు మనకి అన్యాయం చేశారని, నోరు తెరిచి అడిగే మన బిడ్డలని కాదంటామా చెప్పండి! ఆ సొమ్ము రాగానే నేను చెప్పినట్లు ముగ్గురికీ కావలసింది ఇచ్చేయండి" అన్నది.

ఆమె అభిప్రాయం అర్థమైంది. కాగితాలు లోపల పెట్టి బ్యాగు మూసివేశాడు. తనతో నలభై ఏళ్లు కాపురం చేసిన ఆమె కూడా ఏమిటో ఆలోచిస్తోంది. "నే నలా అనుకోవడం లేదు. నా పరిష్కారాలు నా కున్నాయి. రెండు లక్షలు ఫిక్సెడ్ డిపాజిట్లు వేసేశాను. మనకి రిఫ్రిజిరేటరు, డబుల్ కాటు, ఫోమ్ రబ్బరు పరుపులు, సోఫా సెట్లు, కలరు టీ.వీ., వి.సి.పి., మూడు ఫ్యానులు, డైనింగు టేబులు - అన్నీ ఆర్డ రిచ్చేశాను. రంగులు, డిజైన్లు నువ్వూ చూడాలంటే ఇప్పుడే బయలుదేరి వెళదాం పద. ఇవన్నీ వచ్చాక ఒక నెల రోజులు సుఖంగా కాలక్షేపం చేద్దాం. వచ్చే వడ్డీతో వంట మనిషిని పెట్టుకో. ముగ్గురు పిల్లలకీ, కోడళ్లకీ, మనుమలకీ ఒక పాతిక వేలకి పట్టు చీరలు, మంచి బట్టలు కొనేయి. అప్పటికి సంక్రాంతి వచ్చి వెళ్లిపోతుంది. వెంటనే మ నిద్దరం దక్షిణ దేశ యాత్ర వెళ్లడానికి ఏ.సి. టిక్కెట్లు కొన్నాను ఏడు వేల రూపాయలకి. దారి ఖర్చులకి పది వేలు ఉంచాను. మ వ్వొక పాతిక వేలు పెట్టి నీ కిష్టమైన నగ కొనుక్కో. ఇదీ నా ప్లాను. ప్లాను ఏమిటి? అమలు చేశాను" అన్నాడు.

గడగడ ఆయన ఈ మాటలు అంటోంటే ఆమె కళ్లు తిరిగిపోయినాయి. తనతో సంప్రదించకుండా, పిల్లల నోట్లో కరక్కాయ కొట్టడానికి నిర్ణయించేశాడు అని ఒళ్లు మండిపోయింది.

"ఏమంటావు?" అన్నాడు మళ్లీ ఆయనే. ఏ మనే దేముంది అన్నట్లు ఆమె కట్టిన పూలమాలలో చిన్నముక్క తుంపి, తలలో పెట్టుకొని, పెద్ద భాగం శివపార్వతుల బొమ్మకు వేసింది.

"చెప్ప వేమిటి? నువ్వు కూడా నాకు శత్రువైపోతున్నావా?" అన్నాడు.

"నన్ను మీరు శత్రువనే అనుకున్నారుగా! కన్న బిడ్డల అవసరాలు చూడని మీరూ ఒక తండ్రేనా! మా నాన్న మా కింత చేశాడని వాళ్లు సంతోషించడం మీకు గిట్టదు. మన కడుపులో తిన్నది, మనం కట్టుకుని, చుట్టుకున్నదీ గొప్ప అనుకుంటున్నారు. ఆ పాటి పట్టు చీరెలు వాళ్లు కొనుక్కోలేరా? వాళ్లకి ఏది అవసరమో అది చూడలేని మీరు... మీరు" అని కోపంతో మాటరాక, ఆమె బయటికి వెళ్లి అరుగు మీద కూర్చుంది.

బాగా చీకటి పడే వరకు వచ్చీపోయే జనాన్ని చూస్తూ కూర్చుని తరువాత లోపలకు వచ్చి వంట చేసి ఆయన్ని పిలిచి వడ్డించింది.

ఐదారు రోజుల్లో సామానంతా వచ్చిపడింది. ఇల్లంతా ఇరకాటం అయినా, కళతో వెలిగి పోయింది. ఏవో కొత్త లైటు గుత్తులు తెచ్చాడు వెంకటరావు. పంకాలు బిగించాడు. ఉన్న నాలుగు గదులూ హోటలు రూముల్లా మారిపోయాయి.

అనిల్, రమ వచ్చారు. ఈ సామాను చూసేసరికి వాళ్లకి మతి పోయింది. ఎప్పుడూ పాత బట్టలతో ఉండే అత్తగారు, మామగారు ఖరీదైన ఫర్నిచరు వాడతారంటే రమకి విచిత్రమైన వికారం కలిగింది.

మరొక పదిహేను రోజుల్లో కూతురు, పిల్లలు, పెద్దబ్బాయి, పిల్లలు వచ్చి వెళ్లారు. పండుగ పూట వెంకటరావు తెచ్చిన మిఠాయిలు, బట్టలు, పళ్లు, బొమ్మలతో ఇల్లు లక్ష్మీ నివాసంలా మారిపోయింది. అందరూ నవ్వుతూనే ఉన్నారుగానీ, మనస్సులు ముడుచుకుని పోయాయి. ఈశ్వరి అయితే భర్త తెచ్చిన రెండు వరసల గొలుసు, కొత్త గాజులు వేసుకుందిగానీ, దమ్మిడీ అంత ముఖంతో పనులు చేసింది.

అందరూ వెళ్లారు. రైలు సర్క్యూలరు టిక్కెట్లు తీసి చూపించాడు వెంకటరావు ఈశ్వరికి. ఆమె చూసీ చూడనట్లు ఊరుకుంది.

"బట్టలు సర్దేయ్! నాకు ఓపిక లేదు సర్దడానికి" అన్నాడు. నెరసిన జుట్టుతో మిగిలిన పరకలు ముడతలు పడిన చెంపల మీదకి విస్తరించి ఉన్నాయి. కొత్త బట్టలు వంగిన శరీరంపైన తేలికగా అదుముకుని నిలిచాయి.

"అట్లాగే సర్దుతాను - తిండి తిందాం" అన్నది ఉస్సురంటున్న కంఠంతో ఈశ్వరి.

వెంకటరావు తడిగా చూశాడు. పాత చెక్క పీటల మీద కాకుండా టేబిలు మీద కూర్చుని తినే ఈ తరుణం కోసం, నవారు మంచం మీద పలుచని బొంత పరుచుకుని కాక, మెత్తని పక్క మీద ఆదమరచి, ఈశ్వరి వీపు మీద చేయి వేసి పడుకునే విలాసమైన క్షణం కోసం ఏవో కలలు కన్నాడు. చిల్లర కోసం జేబులు తడుముకునే చవుకబారు కక్కుర్తి జీవితం నుంచి, నోట్లు కట్టలుగా రెవరెవలాడే నిర్లక్ష్యమైన వైభోగం చవిచూడాలనుకున్నాడు. అవన్నీ నిజం చేసుకోవడం తప్పా? తప్పనే అంటోంది ఈశ్వరి.

"వెంకటరావుగారూ! మీ ప్రయాణం ఎప్పుడు? యాత్రలకు వెళుతున్నారు కదా, పలకరించి పోదామని వచ్చాను" అంటూ ఒక మిత్రుడు పిలిచాడు. ఆయన్ని సోఫాలో కూర్చోబెట్టి "మంచినీళ్లు" అని కేకవేశాడు వెంకటరావు. ఆయన ఈశ్వరి పెట్టిన స్వీటుని, మెత్తని సోఫాలను, కొత్త అగరువత్తుల వాసనను మెచ్చుకుంటున్నాడు.

వెంకటరావుకి చెమటలు పోస్తున్నాయి. ఏదో పోటులాగా వస్తున్నది. కొంచెంగా ఒరిగి పోతున్నాడు. "ఏమిటండీ?" అని ఈశ్వరి దగ్గరగా వచ్చింది. వచ్చినాయన పళ్లెం వదిలేసి, వెంకటరావుని సోఫా మీద పడుకోబెట్టి, మంచినీళ్లు తాగించబోయాడు. ఏదో విషమిస్తోందని అర్థమైంది. "మీరు ఆ ఫ్యాన్ పూర్తిగా వేయండి. నేను డాక్టర్ని తీసుకొస్తాను" అని పరుగెత్తా డాయన.

ఈశ్వరి వంక చిరు నవ్వుతో చూస్తున్నాడు వెంకటరావు. అది చెరగని చిరునవ్వనీ, అవి మూతబడని కళ్లనీ, డాక్టరు వచ్చే వరకూ తెలియలేదు ఆ ఇల్లాలికి. ●

